క్లుప్తంగా

పురుగుమందుల శాంపిల్స్ సేకరణ



శాంపిల్స్ సేకరిస్తున్న ఏఓ రమేష్

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో పురుగుమందులు తయారు చేస్తున్న సదరన్ పెస్ట్ కంపెనీలో శాంపిల్స్‌ను మండల వ్యవసాయ శాఖాధికారి కె.రమేష్ గురువారం సేకరించారు. అనంతరం కంపెనీ రికార్డులు పరిశీలించారు. పురుగుమందుల నాణ్యతను పరిశీలించడానికి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన పురుగుమందులు ఇవ్వాలన్న లక్ష్యంతో వ్యవసాయ శాఖ పనిచేస్తోందని చెప్పారు. పురుగు మందులు నాణ్యంగా లేకపోతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. సేకరించిన శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపారు. ఆయన వెంట ఫ్యాక్టరీ యాజమాన్యం, వ్యవసాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

సెప్టెంబర్ 8న మాలల యుద్ధభేరి మహాసభ

ఒంగోలు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును, ప్రధాని మోదీ నక్కజిత్తులను వ్యతిరేకిస్తూ సెప్టెంబర్ 8వ తేదీ ఒంగోలు నెల్లూరు బస్టాండులోని అంబేడ్కర్ ఆడిటోరియంలో మాలల యుద్ధభేరి మహాసభ నిర్వహించనున్నట్లు ఆహ్వాన సంఘం కో ఆర్డినేటర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాల యువసేన వ్యవస్థాపకుడు, దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు అధ్యక్షత వహిస్తారని, ముఖ్య అతిథులుగా మాలమహాసభ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయ పోరాట యోధుడు మల్లెల వెంకట్రావు, దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియస్, దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు తదితరులు హాజరవుతారని వెల్లడించారు. మాల మేధావులు, మాల విద్యార్థులు, అంబేడ్కర్ వాదులు, అభ్యుదయ వాదులు పాల్గొని భాగస్వాములు కావాలని కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో అంబేడ్కర్ ఆశయ సమాజ్ జాతీయ అధ్యక్షుడు దండేల కృష్ణ, మాలమహానాడు రాష్ట్ర కన్వీనర్ దారా అంజయ్య, మాలభేరి జాతీయ యువజన విభాగం అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి ప్రియతం ఉన్నారు.

రూ.4 కోట్లతో ఉపాధి పనులు



సంతనూతలపాడులో మాట్లాడుతున్న ఎంపీడీఓ రాఘవేంద్ర

సంతనూతలపాడు (చీమకుర్తి): సంతనూతలపాడు మండలంలో రూ.4 కోట్లతో ఉపాధి పనులు చేపట్టనున్నట్లు ఎంపీడీఓ రాఘవేంద్ర తెలిపారు. సంతనూతలపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది, కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సంతనూతలపాడు మండలానికి ఉపాధి హామీ పథకం ద్వారా కేటాయించిన నిధులతో గ్రామాల్లో సైడు కాలువలు, సీసీ రోడ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఆ విధంగా ప్రణాళికలు రూపొందించుకునేందుకు ఈ నెల 23వ తేదీ గ్రామ సభలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామ సభల్లో స్థానిక ప్రజల సలహాలు, సూచనల మేరకు ఉపాధి హామీ పథకం ద్వారా చేసేందుకు ఉపయోగపడే పనులను గుర్తించాలని ఎంపీడీఓ కోరారు.

అసెస్‌మెంట్ పరీక్షలను పరిశీలించిన ఏఎంవో



పరీక్షలను పరిశీలిస్తున్న ఏఎంఓ రమేష్

ఒంగోలు: పదో తరగతి విద్యార్థులకు గురువారం నిర్వహించిన ట్యాబ్ ఆధారిత అసెస్‌మెంట్ పరీక్షలను ఒంగోలు నగరంలో జిల్లా సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) ఎం.రమేష్ పరిశీలించారు. నగరంలోని డీఆర్ఆర్ఎం, పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలల పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. డీఆర్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో 112 మంది, పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో 66 మంది పరీక్షలకు హాజరయ్యారు. సాంకేతిక సమస్యలేమైనా ఉన్నాయా..? అని ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.

సెల్..హెల్..!



సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమనే విషయం అందరికీ తెలిసిందే. నిత్యం జరిగే రోడ్డు ప్రమాదాలకు ఇది కూడా ఒక ప్రధాన కారణమనే విషయమూ తెలియనిది కాదు. వాహనం కాస్త అటూ..ఇటూ అయిందంటే అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు వెళ్లాలనే విషయమూ తెలిసిందే. ఒక్క క్షణంలో జరిగిపోయే రోడ్డు ప్రమాదంతో ప్రశాంతంగా సాగిపోతున్న జీవితం తలకిందులు కావచ్చు, తీవ్రగాయాలు అవ్వచ్చు, గట్టి దెబ్బ తగిలితే ఏకంగా ప్రాణాలే పోవచ్చు. స్వల్పగాయాలతో బయట పడినా.. కిందపడటం వలన బైక్‌తో పాటు మొబైల్ కూడా పాడవ్వచ్చు. ఎంతోకొంత నష్టమైతే జరగక మానదు. కానీ, ఇవన్నీ ఎవరూ ఆలోచించడం లేదు. ఎవరికీ ఆ స్పృహ ఉండటం లేదు. చివరకు మోటారు వెహికల్ యాక్ట్‌ను కూడా పట్టించుకోవడం లేదు. డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడితే విధించే జరిమానాను భారీగా పెంచారు. రూ.1000 నుంచి రూ.5 వేల వరకూ పెంచుతూ మోటారు వాహన చట్టాన్ని నవీకరించారు. పోలీసులు, రవాణా శాఖ అధికారులు పట్టుకుంటే జరిమానా కట్టాల్సి వస్తుందన్న భయం కూడా లేకుండా విచ్చలవిడిగా మొబైల్లో మాట్లాడుకుంటూ వాహనాలు నడిపేస్తున్నారు. ఒంగోలు నగరంలోని ప్రధాన రహదారుల్లో సైతం ఇలాంటి దృశ్యాలు కోకొల్లలుగా కనిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే రోడ్లలోనూ, ట్రాఫిక్ పోలీసులు ఉండే జంక్షన్లలోనూ.. తగ్గేదే లేదన్నట్లుగా ద్విచక్ర వాహనదారులు వ్యవహరిస్తున్నారు. ఒకచేతితో మాత్రమే బైక్ హ్యాండిల్ పట్టుకుని రెండో చేతితో సెల్‌ఫోన్ పట్టుకుని కబుర్లు చెప్పుకుంటూ హల్‌చల్ చేస్తున్నారు. వెనుక కూర్చున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు, ముందు కూర్చున్న పసిపిల్లల క్షేమం గురించి కూడా ఆలోచించడం లేదు. రోడ్డు ప్రమాదాలకు, పోలీసులకు, రవాణా శాఖ అధికారులకు సవాల్ విసురుతున్నారు. ఏదైనా జరగరానిది జరిగితే ఆ తర్వాత తమతో పాటు తమ కుటుంబం పరిస్థితి ఏమిటనే విషయం మర్చిపోతున్నారు. అందుకు నిలువెత్తు నిదర్శనాలే **ఒంగోలు నగ**రంలోని రోడ్లపై 'సాక్షి' క్లిక్‌మనిపించిన ఈ దృశ్యాలు.

సాక్షి ఫోకస్

– సాక్షి, ఒంగోలు























తీరు మార్చుకోని పోలీసులు

- ఇసుక అక్రమ రవాణాపై గ్రామస్తులు ఫోన్‌చేసినా స్పందన కరువు
- నాలుగు టిప్పర్లు వెళ్లిపోయాక వచ్చి.. ఒక టిప్పర్ పట్టివేత



కొత్తపట్నం పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఇసుక టిప్పర్

కొత్తపట్నం: ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల తీరు మారడం లేదు. పత్రికల్లో ఎన్ని కథనాలు ప్రచురితమైనా.. ఎన్ని విమర్శలు వస్తున్నా.. వారిలో కనీస స్పందన రావడం లేదు. ఇసుక దందాకు పాల్పడుతున్న పచ్చ నేతలకు కొమ్ము కాస్తూ అవినీతి మత్తులో జోగుతున్నారు. ఇసుక మాఫియాతో కలిసి జన్మదిన వేడుకలు చేసుకున్న ఓ ఎస్సై వార్త ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రచురితమవగా, ఎస్పీ స్పందించి ఆ ఎస్సైని వీఆర్‌కు పంపించినప్పటికీ జిల్లా పోలీసుల్లో మాత్రం మార్పు రావడం లేదు. తాజాగా బుధవారం రాత్రి కొత్తపట్నంలో చోటుచేసుకున్న సంఘటన పోలీసుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉంది. కొత్తపట్నంలో బుధవారం రాత్రి టిప్పర్లతో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. స్థానిక ప్రజలు గమనించి వెంటనే పోలీసులకు ఫోన్ చేశారు. ఎవరూ స్పందించకపోవడంతో డయల్ 100కు కూడా ఫోన్ చేశారు. పోలీసులు చాలా ఆలస్యంగా రావడంతో అప్పటికే నాలుగు టిప్పర్లు ఇసుక లోడ్ చేసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాయి. ఒక టిప్పర్ మాత్రమే ఉంది. స్థానికుల జోక్యం మేరకు ఆ టిప్పర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. దానిపై అయినా కేసు నమోదు చేస్తారనే నమ్మకం లేదు. గత వారంలోనూ స్థానికుల ఫిర్యాదు మేరకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కానీ, పచ్చనేతల ఒత్తిడికి తలొగ్గి కేసులు నమోదు చేయకుండానే పంపించి వేశారు. దీనిపై సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైనా పోలీసు ఉన్నతాధికారులు సైతం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇసుక దందాకు పాల్పడుతోంది టీడీపీ నేతలు కావడంతో చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా లేకపోలేదు. ఈసారైనా కొత్తపట్నంలో స్వాధీనం చేసుకున్న ఇసుక టిప్పర్‌పై కేసు నమోదు చేస్తారా..? లేదంటే మళ్లీ టీడీపీ నేతల ఒత్తిడితో వదిలేస్తారా..? అని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు.

శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టి

- కొత్తపట్నం ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన సుధాకర్



ఎస్సై సుధాకర్

కొత్తపట్నం: మండలంలో శాంతి భద్రతల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారించి నిష్పక్షపాతంగా విధులు నిర్వహించనున్నట్లు కొత్తపట్నం పోలీస్‌స్టేషన్ నూతన ఎస్సైగా గురువారం బాధ్యతలు చేపట్టిన వేముల సుధాకర్ అన్నారు. బాధ్యతలు చేపట్టిన వెంటనే ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను 2018 బ్యాచ్‌కు చెందిన ఎస్సైనని తెలిపారు. ఈపూరుపాలెం, పుల్లలచెరువు, తర్లుపాడు మండలాల్లో పనిచేసి బదిలీపై కొత్తపట్నం వచ్చినట్లు చెప్పారు. ఎస్పీ ఆదేశాల మేరకు నియమ నిబంధనలను అనుసరించి పనిచేస్తానని, మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచుతానన్నారు. కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య పరిష్కారంతో పాటు స్థానిక జెడ్పీ హైస్కూల్ పరిసరాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అవసరమైన చోట సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇసుక అక్రమంగా తరలించే వారిపై ఉక్కుపాదం మోపుతానని తెలిపారు. ప్రజలు తన ఫోన్ నంబర్ 9121102126కు ఫోన్ చేసి సమాచారం చెప్పవచ్చన్నారు. స్టేషన్ సిబ్బంది, గ్రామస్తులు ఎస్సైకి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అవసరమైన మేరకే టీచర్లను సర్దుబాటు చేయాలి

ఒంగోలు: ఉపాధ్యాయుల సర్దుబాటును అవసరమైన మేరకు మాత్రమే చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ కీర్తి గురువారం ఒక ప్రకటనలో కోరారు. దిగువ స్థాయిలో ఉన్న సమస్యలు తెలుసుకోకుండా కమిషనర్ కార్యాలయం నుంచి యుడైస్ ఆధారంగా ఆన్‌లైన్‌లో లిస్టులు ఉంచి పని సర్దుబాటును ఎంఈవోలు చేయాలని ఆదేశాలివ్వడం సబబు కాదన్నారు. మాతృత్వ సెలవులు, దీర్ఘకాలంగా విధులకు హాజరుకాని వారి వివరాలు కమిషనర్ స్థాయిలో ఉండవని, ఎంఈవోల ద్వారా అటువంటి ఉపాధ్యాయుల వివరాలు తెప్పించుకుని ఆ స్థానాలను కూడా భర్తీ చేయాలని కోరారు. సెకండరీ గ్రేడ్ టీచర్లను బలవంతంగా ఉన్నత పాఠశాలలకు పంపవద్దని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి కాకుండా 8 తరగతుల ఆధారంగా ఉపాధ్యాయ పోస్టులు కేటాయించాలని అన్నారు. సాధ్యమైనంత వరకు ఏ యాజమాన్యం వారిని ఆ యాజమాన్యం పరిధిలో మాత్రమే సర్దుబాటు చేయాలన్నారు. హిందీ, భౌతికశాస్త్రం ఉపాధ్యాయులను సెక్షన్ల ఆధారంగా కాకుండా విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేటాయించాలని, అవసరమైతే విద్యా వలంటీర్లను నియమించాలని కోరారు.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా ప్రతినిధులు

వైఎస్ జగన్‌ను కలిసిన లీగల్ సెల్ ప్రతినిధులు

ఒంగోలు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గురువారం వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా ప్రతినిధులు కలిశారు. తాడేపల్లిలో నిర్వహించిన వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్రవ్యాప్త ప్రతినిధుల సమావేశం సందర్భంగా మర్యాదపూర్వకంగా వైఎస్ జగన్‌ను కలిశారు. వారిలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కె.స్వామిరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బీఎస్ చక్రవర్తి ఉన్నారు.

నేడు ఉపాధి హామీ పథకం గ్రామ సభలు

కొత్తపట్నం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు గుర్తించడానికి ఈ నెల 23వ తేదీ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.సుజాత తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి మండలంలోని 15 పంచాయతీల్లో పనులు గుర్తించడం కోసం గ్రామ సభలు ఏర్పాటు చేశామన్నారు. ఉపాధి కూలీలు పాల్గొని ఎక్కువ పనులు గుర్తించేందుకు సహకరించాలని కోరారు. అప్పుడే ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించడం సాధ్యపడుతుందన్నారు. ఉదయం 10 గంటలకు అల్లూరు, ఈతముక్కల, కె.పల్లెపాలెం, రాజుపాలెం, సంకువారిగుంట గ్రామాల్లో, 11 గంటలకు గవళ్లపాలెం, గుండమాల, కొత్తపట్నం, మోటుమాల, రంగాయపాలెం, 2 గంటలకు గాదెపాలెం, 3 గంటలకు మడనూరు, పాదర్తి, వజ్జిరెడ్డిపాలెం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెల్లడించారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



ఊరించి.. ఉసూరుమనిపించి..!

కొద్ది రోజులుగా వాతావరణం సెకండ్ సమ్మర్‌ను తలపిస్తోంది. ఆగస్టు ముగుస్తున్నా మండుటెండలు, ఉక్కపోతలు జిల్లాను వీడటం లేదు. ప్రతిరోజూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వర్షం కోసం అందరూ ఆశగా ఎదురుచూస్తున్నారు. మంచి వర్షం కురిస్తే వాతావరణం చల్లబడుతుందని ఒంగోలు నగర వాసులు ఆశిస్తుండగా, చుట్టుపక్కల ప్రాంతాల రైతులు మాత్రం ఖరీఫ్ పంటలు సాగుచేసుకోవచ్చని ఆలోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మసకేసింది. కారుమబ్బులు కమ్ముకున్నాయి. భారీ వర్షం కురిసేలా ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. కానీ, చివరకు కాసిని చినుకులతో సరిపెట్టింది. అది కూడా ఒంగోలు నగరంలో అక్కడక్కడా మాత్రమే కావడంతో అందరూ నిరాశకు గురయ్యారు. - ఒంగోలు సెంట్రల్

ఒంగోలు జీజీహెచ్ సమీపంలో దట్టంగా కమ్ముకున్న మేఘాలు